

మద్దిలో మిషన్ ద్వారా మొక్కజొన్న వెన్నుల నుంచి పిక్కలు తీస్తున్న దృశ్యం



కోతలు మొదలు.. కొనుగోళ్లు ఎప్పుడు?

మొక్కజొన్న కోతలు మొదలయ్యాయి. రైతులు వెన్నులను కోసి, ఎండబెట్టి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ఎప్పుడు ఏర్పాటు చేస్తుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను భద్రపరచడానికి ఇళ్ల వద్ద స్థలం లేక, పొలాల్లో రక్షణ లేక దళారీలకు అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. రాగుల కొనుగోళ్ల కోసం జాప్యం చేసినట్లు ఇప్పుడు కూడా ఆలస్యం చేయవద్దని విన్నవిస్తున్నారు.

- పక్వానికి వచ్చిన మొక్కజొన్న
- భద్రపరిచే చోటు లేక ఆందోళన
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రం కోసం రైతుల నిరీక్షణ
- దళారీలకు అమ్మితే నష్టపోతామని ఆవేదన

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో వేసిన మొక్కజొన్న పంట పక్వానికి వచ్చింది. దీంతో అన్నదాతలు మొక్కజొన్న వెన్నులను కోసి ఎండ బెట్టి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. మండలంలో రబీ సీజన్‌లో 717 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. కృష్ణాపురం, పద్మనాభం, మద్ది, విలాస్కాన్‌పాలెం, కురపల్లి, పాండ్రంగి, ఇసకలపాలెం గ్రామాల్లో డిసెంబర్‌లో ఈ పంట వేశారు. ఎకరాకు సుమారు రూ.25వేలు పెట్టుబడి పెట్టారు. పంట **పక్వానికి రావడంతో మొక్కజొన్న వెన్నులను కోసి ఎండబెట్టి, మిషన్ల ద్వారా పిక్కలను ఒలుస్తున్నారు.** అయితే డిసెంబర్‌లో కురిసిన వర్షం వల్ల దిగుబడి గణనీయంగా పడిపోయింది. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాలి. కానీ, వర్షం దెబ్బకు 15 నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. వారం రోజులుగా రైతులు మొక్కజొన్న పిక్కలను ఒలిచే పనిలో నిమగ్నమయ్యారు. ఆ పిక్కలను బస్తాల్లో వేసి, అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు.

90శాతం రాగులు అమ్మేశాక కొనుగోలు కేంద్రం

రబీలో 734 ఎకరాల్లో రాగు(చోడి)ల పంట వేశారు. నెల రోజుల క్రితమే అధిక శాతం పంట పక్వానికి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో 90 శాతం పంటను రైతులు దళారీ వ్యాపారులకు అమ్మి ఆర్థికంగా నష్టపోయారు. క్వింటా రాగులను రూ.3100 అమ్మేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన మద్ది గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రాగుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాగుల పంట అంతా రైతులు అమ్మేసిన తరవాత ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో వెలవెలబోతోంది. ఇంతవరకు 15 క్వింటాళ్లు మాత్రమే ఈ కేంద్రం ద్వారా కొనుగోలు చేశారు. క్వింటాకు ప్రభుత్వం రూ.4290 మద్దతు ధర ప్రకటించింది. దీంతో రైతులు క్వింటాకు రూ.1190 నష్టపోయారు. రాగుల వలె కాకుండా ప్రభుత్వం మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



మద్దిలో వెలవెలపోతున్న రాగుల కొనుగోలు కేంద్రం

అన్నదాతల్లో అయోమయం

ప్రభుత్వం మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తుందో, లేదో తెలియక అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. కొందరు ఈ కేంద్రం కోసం ఎదురు చూస్తున్నా మరికొంత మంది మాత్రం పొలాల్లోకి నేరుగా వచ్చే దళారీ వ్యాపారులకు అయినకాడికి అమ్మి నష్టపోతున్నారు. దళారి వ్యాపారులు క్వింటాకు రూ.2200 మద్దతు ధర ఇస్తున్నారు. క్వింటా (100 కిలోలు)కు అదనంగా రెండు కిలోలు తీసుకుంటున్నారు. వారు సకాలంలో డబ్బు ఇస్తారనే గ్యారెంటీ కూడా ఉండదు. అయినా పంటను భద్రపరిచే చోటు లేక తప్పనిసరై వారికే విక్రయించేస్తున్నారు.



కృష్ణాపురంలో ఎండబెట్టిన మొక్కజొన్నలు

వెంటనే కొనుగోలు చేయాలి



నేను మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. సుమారు రూ.60వేలు పెట్టుబడి పెట్టాను. ఎకరం విస్తీర్ణంలో పంట ముందుగా పక్వానికి వచ్చింది. డిసెంబర్‌లో వర్షాల కారణంగా దిగుబడి తగ్గిపోయి 15 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో పొలంలోకి వచ్చే దళారీ వ్యాపారికి క్వింటా రూ.2100కు అమ్మేశాను. క్వింటాకు అదనంగా రెండు కిలోలు ఇచ్చాను. ఇంకా రెండెకరాల్లో పంట అమ్మకానికి సిద్ధంగా ఉంది. ప్రభుత్వం కేంద్రం ఏర్పాటు చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

-కె.రమణ, మద్ది

రాగుల కేంద్రం సకాలంలో పెట్టక నష్టపోయాను



నేను రబీ సీజన్‌లో 25 సెంట్ల విస్తీర్ణంలో చోడి పంట వేశాను. ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో దళారీకి క్వింటా రూ.3100 అమ్మాను. ఇప్పుడు ప్రభుత్వం కేంద్రం ఏర్పాటు చేసి క్వింటాకు రూ.4290 మద్దతు ధర ప్రకటించింది. నేను ఐదు క్వింటాళ్లకు రూ.5,950 నష్టపోయాను. మొక్కజొన్న పంట 1.70 ఎకరాల్లో వేశాను, ఇది పక్వానికి వచ్చింది. ఈ పంటైనా దళారీల పాలు కాకుండా ప్రభుత్వం మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి - బి.సన్యాసినాయుడు, మద్ది

కొనుగోలు కేంద్రం కోసం ఎదురు చూస్తున్నాం



నేను మూడెకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. రెండు మూడు రోజుల్లో మొక్కజొన్న వెన్నులను కోస్తాం. సుమారు 65 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశముంది. పొలాల్లోకి వచ్చే ప్రైవేటు వ్యాపారులు క్వింటా రూ.2200 మద్దతు ధర ఉందని చెబుతున్నారు. వీరికి అమ్మితే నష్టపోతాం. ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- బి.ఆదినారాయణ, విలాస్కాన్‌పాలె

ప్రతిపాదనలు పంపాం

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరు తూ మా శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు కూ డా ప్రతిపాదనలు పంపాం. ఆదేశాలను అనుసరించి కేంద్రం ఏర్పాటు చేస్తాం.


-ఎంవీఎస్ చలం, మండల వ్యవసాయశాఖ అధికారి



మద్దిలో అమ్మకానికి బస్తాల్లో వేసి సిద్ధం చేసిన మొక్కజొన్న పిక్కలు

క్లుప్తంగా

పక్షుల కోసం ధాన్యం గుత్తుల ఏర్పాటు



బీచ్ సమీపంలోని చెట్టుకు ఏర్పాటు చేసిన ధాన్యం గుత్తులు

భీమునిపట్నం: మిషన్ గ్రీన్ భీమిలి, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) ఆధ్వర్యంలో సభ్యులు పక్షులకు ఆహారాన్ని అందించేందుకు పలు ప్రాంతాల్లో మంగళవారం ధాన్యం గుత్తులను ఏర్పాటు చేశారు. ముఖ్య సభ్యులు గుల్లల వెంకటేష్, ఎం.ఆదిత్య మాట్లాడుతూ పక్షులకు తమ వంతుసాయం కింద వీటిని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మంటలు ఆర్పే విధానాన్ని ప్రదర్శిస్తున్న ఫైర్ సిబ్బంది

తగరపువలస: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తగరపువలస జంక్షన్ వద్ద అగ్నిమాపక కేంద్ర అధికారి జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరిగే సమయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశాలను సిబ్బంది ప్రదర్శించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు.

మందుబాబులకు రూ.92 వేల జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వారికి న్యాయస్థానం భారీగా జరిమానా వడ్డించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.ప్రసాద్ తెలిపిన వివరాలివి.. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 9 మందిపై కేసులు నమోదు చేసి, మంగళవారం కోర్టు ముందు హాజరు పరిచామన్నారు. న్యాయస్థానం ఒక్కొక్కరికీ రూ.10 వేలు నుంచి 11 వేలు చొప్పున మొత్తం రూ. 92 వేలు జరిమానా విధించిందని ఎస్ఐ తెలిపారు.

భక్తులకు మజ్జిగ వితరణ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

పద్మనాభం: మండలంలోని గంధవరంలో పైడితల్లమ్మ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రతినిధులు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. వెయ్యి లీటర్ల మజ్జిగను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తాటికొండ వెంకటరావు, ఎ.తాతాజీ, కె.వెంకటరావు, సత్యవరపు అశోక్, ఎ.రమేష్, ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు సత్కారం



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరిస్తున్న అతిథులు

మధురవాడ: ఆనందపురం మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులను అధికారులు, స్థానిక రైతులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్యాల సాగుతో మొదలు పెట్టి 365రోజులు ఆదాయం వచ్చేవిధంగా ఏటీఎం మోడల్ ఏ గ్రేడ్ మోడల్ సాగు చేసి, అధిక దిగుబడులు సాధించిన చందల కృష్ణమ్మ, సిరిపురపు నరసమ్మలను ఘనంగా సన్మానించారు. జిల్లా పీఎండీఎస్ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గ్రామంలో ఏవిధంగా చేయాలో జిల్లా ఎన్ఎఫ్ఏ శ్రీనివాస చక్రవర్తి వివరించారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి వెంకటరావు, తాట్రాజు అప్పారావు, పంచాయతీ సెక్రటరీ ధనుంజయ్‌రావు, యూనిట్ ఇన్‌చార్జి పైడిరాజు పాల్గొన్నారు.

రోడ్డుపై పొంగిపొర్లుతున్న మురుగు



మురుగు నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు



కాల్వలు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ నడిబొడ్డున ఉన్న డైలీ మార్కెట్ రోడ్డుపై మురుగునీరు తరచూ రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తోంది. వర్షాకాలంలోనే కాక సాధారణ రోజుల్లోనూ ఇవే ఇక్కట్లు ఎదురవుతుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో అందులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి వెళ్లేటప్పుడు మురుగునీరు పక్కనే ఉన్న దుకాణాలతో పాటు రోడ్డుపక్కన వెళ్తున్న పాదచారులపై కూడా తుళ్లి ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి గొడవలు కూడా జరుగుతున్నాయని వారు వాపోతున్నారు. మార్కెట్‌లో నుంచి హైవేకు వెళ్లాలన్నా.. హైవే నుంచి మార్కెట్‌లోకి వెళ్లాలన్నా మురుగునీటిలో దిగాల్సిందే. కొందరు తప్పక ఇందులోనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. మరికొందరు ఈ మార్కెట్‌కు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. ముఖ్యంగా కాల్వలు శిథిలం కావడం.. నిర్వహణ అంతంత మాత్రంగానే ఉండడమే సమస్యకు కారణమని స్థానికులు అంటున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ను వివరణ కోరగా హైవేను ఆనుకుని ఉన్న భారీ కాల్వల్లో శ్లాబుల కింద చెత్తాచెదారం నిండిపోయాయని తెలిపారు. ఆ పలకలను పైకి లేపి షిల్ట్ తొలగించడానికి వీలులేకపోవడంతో ఈ పరిస్థితి వస్తోందని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల సహాయంతో చర్యలు చేపడతామని చెప్పారు.

సబ్సిడీపై అపరాల విత్తనాల పంపిణీ

పద్మనాభం: రైతులకు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు మినప, పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. మినప విత్తనాలు రెండు క్వింటాళ్లు, పెసలు 3.32 క్వింటాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. మినుములు నాలుగు కిలోల ప్యాకెట్ అసలు ఖరీదు రూ.560 కాగా సబ్సిడీపై రూ.280కు, పెసలు నాలుగు కిలోల ప్యాకెట్ అసలు ఖరీదు రూ.520 కాగా సబ్సిడీపై రూ.260కు రైతులకు సరఫరా చేయనున్నట్టు పేర్కొన్నారు. కావల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలని సూచించారు.

పరిష్కరించని 'వేదిక'

- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా కానరాని చర్యలు
- ఆక్రమణలపై అధికారుల ఉదాసీనత



ఫిర్యాదు చేసిన ప్రాంతంలో అలాగే ఉన్న ఆక్రమణలు



రెండు వారాల క్రితం ఎండాడ రహదారి ఆక్రమణపై జెడ్సీకి ఫిర్యాదు చేస్తున్న 78 ఏళ్ల కమల (ఫైల్)

కొమ్మాది: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్).. పరిష్కరించని వేదికగానే మిగిలిపోతోంది. పీజీఆర్ఎస్‌లో అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తారనే ఆశతో వస్తున్న అర్జీదారులకు అధికారుల ఉదాసీనత కారణంగా నిరాశే మిగులుతోంది. అందుకు నిదర్శనమిదే.

ఈ నెల 7వ తేదీన జీవీఎంసీ 8వ వార్డు ఎండాడకు చెందిన 78ఏళ్ల కమల అనే వృద్ధురాలు ఎండను సైతం లెక్కచేయకుండా మధురవాడ జోనల్ కార్యాలయానికి వచ్చి పీజీఆర్ఎస్‌లో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి ఆక్రమణలపై ఓ వినతిపత్రం సమర్పించారు. ఎండాడ సర్వే నంబర్ 10లో ఒక రెస్టారెంట్ (బిర్యానీ పాయింట్) నిర్వాహకులు సెట్‌బ్యాక్‌లు లేకుండా 3 అడుగులు రోడ్డుపైకి రేకులు షెడ్ నిర్మించారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేగాక, షెడ్‌లోనే వంటలు వండటంతో పొగతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఫిర్యాదు చేసి రెండు వారాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎంటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వీరు చర్యలు తీసుకోకపోతే స్థానికులతో కలసి కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్తామని తెలిపారు. దీనిపై జెడ్సీ కనకమహాలక్ష్మిని వివరణ కోరగా పట్టణ ప్రణాళిక విభాగానికి ఈ ఫిర్యాదు సిఫార్సు చేశామని తెలియజేశారు.

అనూష భర్తను కఠినంగా శిక్షించాలి

ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్



కేజీహెచ్ మార్చురీ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

మహారాణిపేట: మధురవాడకు చెందిన నిండు గర్భిణి అనూషను కడతేర్చిన భర్తను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అత్తిలి విమల డిమాండ్ చేశారు. మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. హోమ్ మంత్రి అనిత ఈ ఘటనపై స్పందించకపోవడం దారుణమని, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, కార్యదర్శి ఎం.డి బేగం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళలతో సృజనకు మెరుగులు



కళల గురించి విద్యార్థులకు తెలియజేస్తున్న ఉపాధ్యాయుడు

తగరపువలస: కళలతో సృజనాత్మకతను వెలికితీయవచ్చని బంగ్లామెట్ట ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. ప్రపంచ కళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటలీకి చెందిన చిత్రకారుడు లియోనార్డో డావిన్సి జయంతి రోజున ప్రపంచ కళాదినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. ప్రపంచ శాంతి, భావ వ్యక్తీకరణ, స్వేచ్ఛ, సహనం, బహుళ సాంస్కృతిక రంగాలకు లియోనార్డో డావిన్సీ ప్రతీకగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, ఈగల సంజీవిని, తరళ్ జిల్లా కో-ఆర్డినేటర్ శంకర్ పాల్గొన్నారు.

వలందపేటలో పారిశుధ్యం అధ్వానం



కనకమహాలక్ష్మి ఆలయ రహదారిలో చెత్తకు మంట పెట్టిన దృశ్యం



వలందపేట రామాలయం వీధిలో పూడుకుపోయిన డ్రైనేజీ

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు వలందపేట శివారులో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. రహదారులు, డ్రైనేజీలు చెత్తతో పేరుకుపోయాయి. దీంతో స్థానికులు తాత్కాలికంగా చెత్తను పోగేసి మంట పెడుతున్నారు. అసలే వేసవి కారణంగా మంటలు చెలరేగి పొగ గ్రామాన్ని చుట్టుముడుతోంది. జాతీయ రహదారి నుంచి కనకమహలక్ష్మి ఆలయం, శ్మశానవాటిక రోడ్డు, రామాలయం వీధి మార్గాలలో పూడుకుపోయిన డ్రైనేజీల చెత్తను తొలగించడమే కాకుండా రహదారులను శుభ్రం చేయించాలని వలందపేట గ్రామస్తులు కోరుతున్నారు. వలందపేట జాతీయరహదారిని ఆనుకుని సర్వీస్ రోడ్డు, డివైడర్‌పై కూడా నిత్యం చెత్తను వేయడంతో, జుగుప్సాకరంగా తయారయ్యాయి.

గుండె నొప్పితో దివీస్ ఉద్యోగి మృతి



మధుమోహన్ (ఫైల్)

కొమ్మాది: గుండెనొప్పితో దివీస్ ఉద్యోగి మృతి చెందిన ఘటన చిప్పాడలో చోటు చేసుకుంది. సీఐ తిరుమల రావు తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలానికి చెందిన వేంద్ర మధుమోహన్ (24) భీమిలి మండలం చిప్పాడ దివీస్‌లో ఉద్యోగం చేస్తూ, దివీస్ సమీపంలో ఉన్న ఓ హాస్టల్‌లో స్నేహితులతో కలసి ఉంటున్నాడు. రోజులాగే విధులు ముగించుకుని సోమవారం రాత్రి తన రూమ్‌కు చేరుకున్నాడు. వచ్చిన వెంటనే స్నానం చేసి బయటకు వచ్చి ఫోన్‌లో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన స్నేహితులు 108 కు ఫోన్ చేసి తగరపువలస ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మధుమోహన్ గుండెనొప్పితో మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

మధురవాడ: ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకుంటే చాలా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని భీమునిపట్నం సీడీపీవో శ్రీదేవి తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం బొడ్డపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, పిల్లలకు పౌష్టికాహారం-పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తక్కువ ధరలకే లభించే ఆకుకూరలు, చిరుధాన్యాల ద్వారా పోషకాలు అందుతాయని, వాటిని వినియోగించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరత్నం, కార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న పురుషోత్తం

తగరపువలస: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా 'అక్షయశక్తి' కృషి చేస్తోందని సంస్థ సీఈవో పురుషోత్తం అన్నారు. భీమునిపట్నం మండలం మజ్జివలస, విజయరాంపురం గ్రామాల్లో మహిళలకు అక్షయధాగా స్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. పురుషోత్తం మాట్లాడుతూ మహిళలకు రోజుకు చొప్పున 150 గంటలు శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ పొందిన వారికి తమ సరస్తే కుట్టు మిషన్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో భీమునిపట్నం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు తుపాకుల ఆదిలక్ష్మి, ఎల్.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన పైడితల్లమ్మ ఉత్సవాలు

పద్మనాభం: గంధవరంలో మూడు రోజులుగా జరుగుతున్న పైడితల్లమ్మ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా సాయంత్రం ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించారు. గొర్రెపోతు ఆకారంలో ఉన్న బొమ్మను గ్రామంలో ఊరేగించారు. రథాల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.